www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 14 సెప్టెంబర్ 2025
5
తిరుపతి

ఎలుక జోస్యం వింటారా..?



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ పావురాల రాయబారం తెలుసు... చిలుక జోస్యం విని ఉన్నాం.. తాజాగా ఎలుక జోస్యం వినాలని అనుకుంటున్నారా? అయితే నగరి నియోజకవర్గం వడమాలపేట మండలానికి రావాల్సిందే.. అంజీరమ్మ గుడి వద్ద సిద్దమణి ఎలుక జోస్యం చెబుతాడని ఊరూరా పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ఎలుక జోస్యం చెప్పడం ఏంటని కొంతమంది ఎలుకను చూడాలనే ఉత్సుకతతో జోస్యం చెప్పించుకునేందుకు వస్తుండటం గమనార్హం. గతంలో సిద్దమణి సొంతూరు నారాయణవనంలో 30 ఏళ్లుగా చిలుక జోస్యం చెప్పేవాడు. ఈ మధ్యకాలంలో ఆయన చెన్నయ్‌లో ఎలుక జోస్యం చూసారట. మనమెందుకు మన ఊళ్లో చెప్పకూడదని నిర్ణయించుకుని చెన్నయ్‌లో శిక్షణ పొందిన ఎలుకను కొనుగోలు చేసి, కొంతకాలం పాటు దానిని మచ్చిక చేసుకుని అంజీరమ్మ ఆలయం వద్ద ఈ ఎలుక జోస్యం చెప్పడం ప్రారంభించాడు. ఈ జోస్యం చెప్పించుకునేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తుండటం గమనార్హం. ఎలుక వినాయకునికి వాహనం కావడంతో, మూషిక వాహనం కాబట్టి సెంటిమెంట్‌గా ఫీల్ అవుతున్నారని, ఎలుకకు 'గణేష్' అని నామకరణం చేసినట్లు సిద్దమణి 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఆ ఎలుక తెల్లగా ఉండటం ఆసక్తిదాయకం.

వైద్య శాఖలో దళారుల దందా

గప్‌చిప్‌గా 'భ్రూణహత్యలు'

తిరుపతి, గూడూరు కేంద్రంగా 'మాఫియా' / శ్రీకాళహస్తిలో 1000:629 లింగ నిష్పత్తి

లింగ నిర్ధారణ పరీక్షలు, గర్భస్రావం చేయడం నేరమని తెలిసినా కొందరు అక్రమంగా..గుట్టుగా ఈ పరీక్షలు నిర్వహించేస్తున్నారు. తిరుపతి, గూడూరు నగరాల వేదికగా వైద్యశాఖలో దళారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ఈ దందా కొనసాగిస్తున్నారు. అనుమానాలకు తావివ్వకుండా.. ఎలాంటి రిపోర్టులు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ పిండ మాఫియాలో ప్రయివేట్ వ్యక్తుల హస్తంతో పాటు ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రుల్లో పనిచేసే కొందరు గైనకాలజిస్టుల పాత్ర ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. లింగ నిర్ధారణకో రేటు.. గర్భస్రావానికో రేటు నిర్ణయించి కోట్లు గడిస్తున్నారు. వైద్య వత్తిలో ఉంటున్న కొందరి ధన దాహం వల్ల సమాజంలో బాలికల నిష్పత్తి తగ్గిపోతోంది. దానికి ఉదాహరణే పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో వెయ్యి మంది బాలురకు కేవలం 629 మందే బాలికలు ఉండడం. మూడు నెలల క్రితమే ఆర్డీవో హెచ్చరించినా, వారం రోజుల క్రితం కలెక్టర్ సమీక్షించినా ఎటువంటి జాగ్రత్తలు తీసుకుని వైద్యశాఖ ఈ లింగ నిష్పత్తిని ఎలా సరిజేస్తుందో వేచి చూడాల్సిందే. లేదంటే ఈ అసమానత భవిష్యత్‌లో భయంకరమైన పరిణామాలకు దారితీయక తప్పదు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

లింగ నిర్ధారణ పరీక్షలు అత్యంత రహస్యంగా నిర్వహిస్తున్నారు. దళారులు గర్భిణులను, సంబంధీకులను గుట్టుగా తిరుపతి, గూడూరు నగరాలకు తీసుకెళ్తున్నారు. అక్కడికి వెళ్లాక ఒప్పందం కుదుర్చుకున్న ఆసుపత్రికి సమాచారం అందిస్తారు. గర్భిణీతో ఎక్కువ మంది రాకుండా, ఆమెతోపాటు మరొకరిని వెంటబెట్టుకుని ప్రత్యేక వాహనంలో తరలిస్తారు. ఆస్పత్రి పేరుగానీ, చిరునామాగానీ ఎలాంటివి చెప్పకుండానే తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించి పుట్టబోయేది ఆడ.. మగ చెప్పి రిపోర్టులు చేతికి ఇవ్వకుండా పంపేస్తున్నారు. లింగ నిర్ధారణ స్కానింగ్ కోసం సుమారు రూ.25 నుంచి రూ. 30 వేలు వసూలు చేస్తుండగా గర్భస్రావం చేయించేందుకు మరో రేటు తీసుకుంటున్నారు. తిరుపతిలో అయితే రూ.25 వేలు, గూడూరు, శ్రీకాళహస్తి, నాయుడుపేట ఇతర ఆసుపత్రుల్లో రూ.20 వేలు తీసుకుంటున్నట్లు తెలిసింది. కొన్ని ఆసుపత్రులు ఈ దందాను గుట్టుగా సాగిస్తున్నాయి. గర్భం దాల్చిన 20 వారాల తర్వాత గర్భ విచ్ఛిత్తి చేయడం అత్యంత ప్రమాదకరం. అందుకే ప్రభుత్వాలు కఠిన నిబంధనలు, చట్టాలు తీసుకొచ్చాయి. కొందరు ధనార్జన కోసం ఇష్టారీతిగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. లింగనిర్ధారణ పరీక్షలతో గర్భస్రావాలు ఎక్కువగా చేస్తున్నారు. ఈ ప్రభావం లింగ నిష్పత్తిపై పడుతోంది. ముఖ్యంగా గూడూరు, తిరుపతి నగరాల్లో ఆంగ్ల భాషలో 'ఎం'తో మొదలయ్యే ఆసుపత్రుల కేంద్రంగా ఈ దందా సాగుతున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి.

ముందు మగ బిడ్డే కావాలి

ముందు మగబిడ్డ పుడితే చాలు.. ఆ తర్వాత ఎవరూ పుట్టినా పర్వాలేదు. మళ్ళీ మగ బిడ్డ పుడితే ఇంకా మేలే.. ఒకవేళ ఆడ బిడ్డ పుట్టినా.. కొడుకూ, కూతురు పుట్టిందని సంబరపడిపోతాం.. ఇదీ ప్రస్తుత సమాజంలో పిల్లలు కావాలంకుంటున్న తల్లిదండ్రుల పరిస్థితి. ముందు కొడుకు పుట్టి మరో సంతానంగా కూతురు పుడితే అక్కడితో ఆపేస్తున్నారు. అలా కాకుండా ముందు ఎంతమంది కూతుళ్లు పుట్టినా కొడుకు కోసం కొందరు పోరాడుతున్నారు. ఇంకొందరు కొడుకుల కోసం ఆడ నలుసులను గర్భంలోనే నులిమేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే శ్రీకాళహస్తి ప్రాంతంలో వీధికో గాథ బయటపడుతోంది. ఇలా ఆడ నలుసు పురిటి కళ్ళు కూడా తెరవకముందే భ్రూణ హత్యలకు గురవుతుంటే మరో పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత అంటూ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇకనైనా వైద్య శాఖ నిద్ర మేల్కొని లింగ నిర్ధారణ, గర్భస్రావాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లింగ అసమానతలపై జాతీయ సదస్సులో చర్చించాలి

పి.సాయిలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి

తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో అత్యంత దయనీయంగా ఆడపిల్లల నిష్పత్తి పడిపోయిందని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. ఆడపిల్లల శాతం తగ్గిపోతుందన్న అంశాన్ని ఆది, సోమవారాల్లో జరిగే మహిళా సాధికారిత జాతీయ సదస్సులో చర్చించాలి. తిరుపతి జిల్లాలో వెయ్యి మంది బాలురకు 916 మంది బాలికలు ఉంటే, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వెయ్యిమంది బాలురకు 630 మంది బాలికలు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. వైద్యశాలల్లో దళారుల దందాను అరికట్టి, లింగ పరీక్షలు చేసే ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి.

కార్మికుల ప్రాణాలకు భద్రతేది..?

- జింక్‌తొట్టెలో కరిగిపోయిన మృతదేహం
- భద్రత పట్టని పరిశ్రమల యాజమాన్యం
- 10 మందికి తీవ్ర గాయాలు
- మృతునికి రూ.50 లక్షలివ్వాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్

తిరుపతి జిల్లాలో పరిశ్రమల్లో భద్రత లేకుండా పోయింది.. ఉదయం షిఫ్ట్‌కు పనికి వెళ్లిన కార్మికుడు సాయంత్రానికి ప్రాణాలతో ఇంటికి తిరిగి వస్తాడో రాడో చెప్పలేని దయనీయ పరిస్థితి.. ప్రమాదకరమైన పనుల్లో పని చేయించుకుంటూ, ఫ్యాక్టరీ యాజమాన్యం కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం, పర్యవేక్షణ లోపం అడుగడుగునా కనిపిస్తోంది. గూడూరు రూరల్ పరిధిలోని ఓ పరిశ్రమలో 600 డిగ్రీల సెల్సియస్ జింక్‌పాట్‌లో పడి ఓ కార్మికుడు ఆదిత్యకుమార్ (30) దుర్మరణం పాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. జింక్ ద్రావణం వెదజల్లడంతో పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన నెల్లూరుకు, అక్కడనుంచి నలుగురిని చెన్నయ్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానికుల వివరాల మేరకు...

గూడూరు రూరల్ పరిధిలోని తుంగపాలెంలో 'కలర్‌షైన్' పరిశ్రమ ఉంది. ఇందులో రంగురంగుల లేటెస్టు రేకులను తయారు చేస్తుంటారు. జింక్‌పాట్ (తొట్టె) వద్ద 600 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. హైడ్రోజన్ ఎంత వాల్యూమ్ ఉందో తెలుసుకునేందుకు సల్ఫర్‌రాడ్‌ను వెలిగిస్తారు. అందులో గ్యాస్ తక్కువ మోతాదులో ఉంటే ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఎక్కువ మోతాదులో గ్యాస్ నిల్వలు ఉంటే ప్రమాదం. శనివారం ఎప్పటిలాగే హైడ్రోజన్ వాల్యూమ్ ఎంత ఉందో గుర్తించే ప్రయత్నం చేయగా గ్యాస్ నిల్వలు ఎక్కువగా ఉండడంతో ఒత్తిడికి గురై జింక్‌పాట్ ఒక్కసారిగా పగిలిపోయింది. జింక్ ద్రావణం మొత్తం వెదజల్లి అక్కడ పనిచేస్తున్న మెయింటినెన్స్ డిపార్టుమెంట్ కార్మికులైన పది మందిపై పడింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్యకుమార్ జింక్‌పాట్‌లో పడి శరీరం పూర్తిగా ద్రవంలో కరిగిపోయింది. శ్యాంసుందర్, సతీష్‌కుమార్, అమాన్‌దివేది, సోమియాపాండా, హీరేంద్రప్రతాప్ సింగ్, బబ్బులు భగత్, శశికాంత్ మిశ్రా, విక్కీకుమార్, గణేష్‌రాయ్, అభ్యకుమార్ సింగ్‌లకు గాయాలు కావడంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఐదుగురు తీవ్రంగా గాయపడడంతో మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నయ్ ఆస్పత్రికి తరలించారని తెలుస్తోంది. గాయపడిన వారిలో ఓ కార్మికునికి కంట్లో జింక్ ద్రావణం పడడంతో కన్ను పోయినట్లు సమాచారం.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ, తహశీల్దార్

ఆదిత్యకుమార్ (మృతుడు)

మృతుడు ఆదిత్యకుమార్‌కు భార్య, మూడేళ్ల బాబు, మూడు నెలల పాప ఉంది. మృతదేహం కరిగిపోవడంతో సాటి కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. భార్య బాధ వర్ణనాతీతం. మృతుని కుటుంబానికి 50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబ పోషనకు ప్రతినెలా కొంత నగదును కంపెనీ నుంచి కుటుంబ సభ్యులకు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. గాయపడిన క్షతగాత్రులకు 25లక్షల చొప్పున ఇవ్వాలని, మెరుగైన చికిత్స అందించి వారిని కాపాడాలని కోరుతున్నారు. గూడూరు రూరల్ సిఐ కిషోర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగిందని, ఒకరు మృతిచెందారని, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్యకుమార్ చనిపోయినట్లుగా గుర్తించామని తెలిపారు. సంఘటనా స్థలాన్ని తహశీల్దార్ ప్రసాద్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నేడు సిఎం చంద్రబాబు రాక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, చంద్రగిరి

జాతీయ మహిళా సాధికారిక సదస్సుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఉదయం 7.30 గంటలకు గూడూరు జిల్లా తాడేపల్లి మండలంలోని ఉండవల్లి గ్రామం నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరుతారు. ఉదయం 9 గంటలకు తిరుపతి నగరం తనపల్లి రోడ్డులోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 9.20 గంటలకు కొర్లగుంట శ్రీ కన్వెన్షన్ వద్దకు చేరుకుని వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడనుంచి బయల్దేరి 10.05 గంటలకు రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. సదస్సులో పాల్గొని అధికారిక భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2.15 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

లైటింగ్ షో, సాంస్కృతిక కార్యక్రమాలపై సమీక్ష

చంద్రగిరి కోటలో మహిళా సాధికారత జాతీయ సదస్సు సంబంధించిన లైటింగ్ షో, విందు, సాంస్కతిక కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లను చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని పరిశీలించారు. సదస్సుకు వచ్చే అతిథులకు ఎటువంటి ఆటంకం కలగకుండా, అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే తెలియజేసారు. సదస్సుకు వచ్చే వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేసి కోట పరిసర ప్రాంతాలలో శానిటేషన్ చేయమని అధికారులను ఆదేశించారు. కోట లైటింగ్ షోను ప్రదర్శించే సమయంలో అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు.

'స్త్రీ శక్తి'కి ఆదరణ

నెలలో 25 లక్షల మంది ప్రయాణం
మహిళలకు రూ.10 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 'స్త్రీ శక్తి' ప్రారంభించి నెలరోజులయ్యింది... సరిగ్గా ఆగస్టు 15న సాయంత్రం 4 గంటలకు స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించారు. సెప్టెంబర్ 13 సాయంత్రం 4 గంటల వరకూ తిరుపతి జిల్లాలో 25 లక్షల 13వేల మంది ప్రయాణించారని ఆర్టీసీ ఆర్ఎం జగదీష్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. 'జీరో టికెట్' ద్వారా ప్రయాణించడం ద్వారా జిల్లాలో ప్రయాణించిన మహిళలకు 10 కోట్ల రూపాయల మేర లబ్ధి పొందారని అంచనా. ఆగస్టు 15 నుంచి ఆగస్టు 31 వరకూ 13లక్షల 42వేల మంది ప్రయాణించారు. 4 కోట్ల 65 లక్షల మంది లబ్ధి పొందారు. అలాగే సెప్టెంబర్ 1 నుంచి 13వ తేదీ వరకూ 11 లక్షల 71వేల మంది ప్రయాణించగా 5 కోట్ల 34లక్షల రూపాయలు లబ్ధి పొందారు. తిరుపతి - సత్యవేడు, పుత్తూరు - చిత్తూరు, తిరుపతి - చిత్తూరు, గూడూరు - నెల్లూరు, గూడూరు - తిరుపతి మార్గాల్లో బస్సులు చాలడం లేదన్న విషయాన్ని గుర్తించామని చెప్పారు. టైమింగ్స్ సర్దుబాటు చేసి, ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులను ఈ మార్గాల్లో నడపడం వల్ల మహిళల ఇబ్బంది కొంత తగ్గించగలిగాం. అంతర్రాష్ట్ర బస్సుల మధ్య అనుమతి లేదు. పుత్తూరు - చిత్తూరు, తిరుపతి - చిత్తూరు మాత్రం అదనంగా నాలుగు బస్సులను రెండు మూడు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. జిల్లాలో ఈ పథకం ప్రారంభించే నాటికి కేవలం 2,800 మాత్రం తొలిరోజు ప్రయాణించారు. గరిష్టంగా రోజుకు 80వేల పైనే మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నారని గుర్తించాం.

ఇద్దరు ఎస్పీలూ మారారు

తిరుపతికి సుబ్బరాయుడు
చిత్తూరుకు తుషార్ డూడి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ ఐపిఎస్ అధికారులు బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుకు పోస్టింగ ఇవ్వలేదు. ఆయన స్థానంలో బాపట్ల జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న తుషార్ డూడి రానున్నారు. తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. గతంలో ఎస్పీగా పనిచేసి వైకుంఠ ఏకాదశి తొక్కిసలాట సందర్భంగా బదిలీ అయిన సుబ్బరాయుడు తిరిగి తిరుపతి జిల్లా ఎస్పీగా వచ్చారు. తుషార్ డూడి బాపట్ల జిల్లా ఎస్పీగా పనిచేశారు. తుషార్ డూడి యుపిఎస్సీ ద్వారా సెలక్ట్ అయ్యారు. మహిళల భద్రతపై బాపట్లలో చర్యలు తీసుకున్నారు. గంజాయి, రౌడీమూకలను ఏరివేయడంలో జిల్లాలో గడగడలాడించారు. 2018 బ్యాచ్‌కి చెందిన తుషార్ డూడి గతంలో గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్, చింతపల్లి అదనపు ఎస్పీ, అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ, వైఎస్ఆర్ కడప, గుంటూరు అర్బన్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఎస్పీగా పనిచేశారు.

నగర వనం నడకదారిని బాగు చేయండి : సిపిఎం, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో దివ్య రామమనే ఎస్‌వి నగరవనం చాలా ప్రాముఖ్యత సంతరించుకుంది. ఆహ్లాదకరమైన వాతావరణం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది.. వాకర్లకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తోంది. అటువంటి నడకదారి రాళ్లు తేలి నడకదారులకు, ముఖ్యంగా సీనియర్ సిటిజనులకు చాలా ఇబ్బందిగా మారిందని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.నరేంద్ర పేర్కొన్నారు. వర్షం వల్ల ఏర్పడిన గుంటలను పూడుస్తున్నప్పటికీ రాళ్ళను కూడా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ షటిల్ ఆడుతున్న కోర్టులు ఎక్కువగా ఉన్నందున షటిల్ కోర్టులను అభివద్ధి చేయాలని కోరారు. నడకదారి చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేస్తే మరింత ఆహ్లాదకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

దర్జాగా 'కబ్జా'

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కబ్జాకు కాదేది అనర్హం. ప్రభుత్వ భూములు, మఠం భూములు, లిటిగేషన్ ఉన్న భూములపై అధికార అండదడలతో కబ్జాలకు పాల్పడడం పరిపాటిగా మారిపోతోంది. అధికారబలంతోనో, రౌడియిజంతోనో బెదిరించి భూములను వశపరచుకుంటున్నారు. కబ్జా రాయుళ్లు మరో అడుగుముందుకేసి ఏకంగా స్మశాన వాటికను, రజకుల దోబీఘాట్ స్థలాలను హస్తగతం చేసుకుంటుండటం గమనార్హం.

ప్రపంచ ప్రసిద్దిగాంచిన ఆధ్యాత్మిక కేంద్రంగా తిరుపతి ప్రసిద్ది. కానీ ఇటవల కాలంలో అక్రమార్కులకు అడ్డాగా మారుతుండడం శోచనీయం. ఇలాంటి ప్రాముఖ్యత గల జిల్లాపై కబ్జా రాయుళ్ల కన్ను పడింది. గతంలో కేవలం కిలోమీటరు కూడా విస్తరణ లేని తిరుపతికి చుట్టుపక్కల వేల ఎకరాల వ్యవసాయ భూములు, పదుల సంఖ్యలో చెరువులు, వాగులు, కిలోమీటర్ల పొడవైన స్వర్ణముఖి నదిపరివాహక ప్రాంతంతో కళకళ లాడేది. కేవలం మూడు దశాబ్దాల్లో తిరుపతి పరిసరాలు మొత్తం ఆక్రమణకు గురయ్యాయి. నదులు, వాగులు, వంకలు, కాల్వలు, బావులు, చెరువులు, సరుస్సులు ఆక్రమించి దురాక్రమణ దారులు పాగా వేశారు. దశాబ్దాకాలంలో భూమి ధరలు రోజు రోజుకు పెరుగుతుండడంతో నకిలీ పత్రాలతో భూములను కాజేసేందుకు అధికార దర్పాన్ని ప్రయోగిస్తున్నారు. గడిచిన రెండు సంవత్సరాలుగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖాళీజాగా కన్పిస్తే చాలు దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. మనిషి జీవితంలో చివరి మజిలిగా ఉన్న స్మశానాలనూ వదలడం లేదు. రజకులు బట్టలు శుభ్రం చేసే దోబీఘాట్‌లను కూడా కాజేస్తున్నారు. జిల్లాలో 377 గ్రామాల్లో శ్మశాన సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. చాలా గ్రామాలకు స్మశానాలు లేవు. ఉన్న వాటికి దారి ఇవ్వకుండ అడ్డుకుని, ఆ భూములను ఆక్రమణ చేస్తున్నారు. దోబీ ఘాట్లను కూడా వదలడం లేదు. తిరుపతి రూరల్ వేదాంతపురం పరిధిలోని సర్వేనెంబరు 214లో ప్రభుత్వం రజకులకు కేటాయించిన 56 సెంట్ల భూమిపై కొంత మంది బూర్జువా రాజకీయ నాయకులు కన్నేశారు. వారికి అధికారులు అండ ఉండనే ఉంది. ఇంకేముంది రాత్రికి రాత్రే దోబిఘాట్‌లో అక్రమ కట్టడాలను ప్రారంభించారు. ప్రశ్నించిన రజకులను భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో వామపక్ష పార్టీలు రంగ ప్రవేశం చేసి, రజకులకు అండగా పోరాటాన్ని చేపట్టింది. జిల్లాలో శ్మశాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి విన్నవించారు.

రీ సర్వేపేరుతో అమ్మచెరువు రైతులను వేదింపులకు గురి చేస్తున్నారు. ఒకటిన్నర కిలోమీటరు రోడ్డు పని పూర్తి చేయకుండా శ్రీకాళహస్తి పాతగుంట పంచాయతీలో ప్రభుత్వ అధికారులు అమ్మచెరువు గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తిరుపతిలోని ప్రభుత్వ స్థలాలు కబ్జారాయుళ్లపరం కాకుండా, బలహీనవర్గాలకు చెందిన స్మశానాలు, దోబీఘాట్లు కబ్జాకాకుండా చూడాల్సి ఉంది.

ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి స్థానిక పుచ్చపల్లి సుందరయ్య భవన్ లో శనివారం సిపిఎం అగ్ర నేత, పూర్వ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రజాస్వామ్య హక్కుల పోరాటంలో ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. దేశంలో భారత రాజ్యాంగం, మౌలిక విలువలపై మోడీ ప్రభుత్వం దాడి చేస్తోందనీ, మతాన్ని రాజకీయాలకు వాడుకుంటూ ప్రజల మధ్య చీలికలు తీసుకు వస్తోందని విమర్శించారు. లౌకిక, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగించడమే సీతారాం ఏచూరికి ఘనమైన నివాళి అన్నారు. పెనగడం గురవయ్య, సంక్రాంతి వెంకటయ్య, వేణు పాల్గొన్నారు.

నేడు 'మనువాదం.. దళితులు'పై సదస్సు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కుల వ్యవక్ష వ్యతిరేక పోరాట సంఘం, టిటిడి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 14వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు పెద్దకాపు లేఔట్‌లోని యుటిఎఫ్ ఉపాధ్యాయ భవన్ నందు 'మనువాదం..దళితులు'పై సదస్సు జరుగుతుందని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కేరళ ఎమ్మెల్యే కె శాంత కుమారి, వక్తగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి పాల్గొంటారని తెలిపారు.

రేపు మారిషస్ ప్రధాని తిరుపతికి రాక

ప్రజాశక్తి - రేణిగుంట

మారిషస్ ప్రధానమంత్రి నవన్‌చంద్ర రాంగుళ సోమవారం తిరుపతి రామాపురంలోని బ్రహ్మర్షి ఆశ్రమాన్ని సందర్శించి, అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. తిరుపతి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మార్షస్ ప్రధాని పర్యటనలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్, అడిషనల్ ఎస్పీ వెంకట్రావులతో కలిసి భద్రతా ఏర్పాట్లపై రేణిగుంట విమానాశ్రయంలో సమీక్షించారు.

రౌడీమూకల నుంచి రక్షించుకుందాం

- గంజాయి నివారణలో కూటమి వైఫల్యం
- తిరుపతిలో వామపక్ష, ప్రజాసంఘాల శాంతిర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వామపక్ష, ప్రజాసంఘాల నేతృత్వంలో తిరుపతిలో ర్యాలీ

తిరుపతి నగరంలో గంజాయి మత్తు పదార్థాలను నివారించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని సిపిఐ, సిపిఎం, సిపిఐఎంఎల్, ఆర్‌పిఐ, కాంగ్రెస్ నేతలు విమర్శించారు. 'రౌడీమూకల నుంచి నగరాన్ని రక్షించుకుందాం' అంటూ తిరుపతి గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ వామపక్ష, ప్రజాసంఘాల శాంతిర్యాలీ శనివారం ఉదయం జరిగింది. 'గంజాయి నివారణలో కూటమి వైఫల్యం' అంటూ నినదించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు , సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పి వెంకటరత్నం, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు పి అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్టిబాబు మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రశాంతతకు భంగం కలిగించే విధంగా రాజకీయ రౌడీ మూకల నుండి తిరుపతి నగరాన్ని కాపాడడంలో అటు కూటమి ప్రభుత్వం, ఇటు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిదన్నారు. ఇది ఇలాగే వదిలేస్తే తిరుపతిలో శాంతిభద్రతలు క్షీణించి ఒక భయానక వాతావరణం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విధానాలను ఏమాత్రం వదిలిపెట్టకుండా కూటమి ప్రభుత్వం ఆ విధానాలనే కొనసాగించే క్రమంలోనే పవిత్ర పుణ్యక్షేత్రంలోకి గంజాయి, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలను విచ్చలవిడిగా సరఫరా చేయడం వల్ల యువత పూర్తిగా గంజాయి మత్తులో అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రౌడీలు రాజకీయ అండదండలను అడ్డం పెట్టుకొని భూ కబ్జాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నా పోలీసులు మాత్రం ప్రేక్షక పాత్ర వహించడం అత్యంత బాధాకరమన్నారు. ప్రజలను రక్షించాల్సిన పోలీసులే రౌడీలకు, గంజాయి బ్యాచ్ లకు వత్తాసు పలుకుతూ వారికి అండగా ఉంటున్నారన్నారు. ఈ శాంతియుత ర్యాలీలో నాయకులు జిల్లా విశ్వనాధ్, చిన్నం పెంచలయ్య, సుబ్రహ్మణ్యం జయ చంద్ర, సాయిలక్ష్మి, బుజ్జి , రాధాకష్ణ, డిఎంసి భాస్కర్, ఆర్ వెంకయ్య పాల్గొన్నారు.

శివశివా..మరుగుదొడ్లేవి..!

కైలాసకోనలో భక్తుల అగచాట్లు
అటవీ అధికారుల మొండివైఖరి

ప్రజాశక్తి - ఏర్పేడు

కైలాసకోన తిరుపతి జిల్లాలో ప్రముఖ యాత్రాస్థలం. నారాయణవనం మండలంలో పూర్వీకుల నుంచి వెలసిన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. సమీపంలోనే ప్రకృతిసిద్ధమైన జలపాతం, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడకు వస్తుంటారు. అయితే మౌలిక వసతులు లేకపోవడం, కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో భక్తుల అగచాట్లు వర్ణనాతీతం.

కైలాసకోన శివుని ఆలయానికి తమిళనాడు, కర్నాటక, ఉమ్మడి చిత్తూరు జిల్లాల నుంచి భక్తులు, యాత్రికులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ప్రకృతి సిద్ధంగా ఏర పడిన జలపాతాన్ని వీక్షిస్తుంటారు. భక్తుల రద్దీ పెరుగుతున్న కొద్దీ ఆలయంలో మౌలిక వసతులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులదే. అయితే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో, గ్రామస్తులు తామే మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామని ముందుకొచ్చారు. అయితే అటవీ అధికారులు అడ్డుకోవడంతో గ్రామస్తులు మండిపడుతున్నారు. అధికారులు కనీస సౌకర్యాలు కల్పించరు, గ్రామస్తులు ముందుకొచ్చి నిర్మించుకుంటామంటే ఆటంకాలు సృష్టిస్తున్నారని వాపోతున్నారు. ఆలయ ఆదాయం పెరుగుతున్నా కనీస సౌకర్యాలను కల్పించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారన్నది వారి ఆవేదన.

యాత్రికులకు వసతులు కల్పించాలి : సిపిఎం

కైలాసకోనకు వచ్చే యాత్రికుల సంఖ్య ఇటీవల కాలంలో బాగా పెరిగింది. కనీస సౌకర్యాలు లేకపోవడంతో అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులే మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు నిర్మించుకోడానికి ముందుకొచ్చారు. అయితే ఫారెస్టు అధికారులు అడ్డుకోవడం దారుణం. మఠాలు, ఆశ్రమాల పేరుతో అటవీ భూమిని ఆక్రమించి అన్యాక్రాంతం చేస్తున్న వారి పట్ల జిల్లా ఫారెస్టు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుని స్వాధీనం చేసుకోవాలి. భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణాన్ని అధికారులే చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

రాస్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి -ఏర్పేడు : రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వ ర్యంలో చెల్లూ రులో టైలరింగ్ శిక్షణను శనివారం ప్రారంభిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల టిడిపి అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు మాట్లాడుతూ మహిళ విద్య, ఆర్థిక రాజకీయ, సామాజికంగా అభివృద్ధి చెందుతోందని ఇది మహిళా చైతన్యానికి నిదర్శన మన్నారు. రాస్ సంస్థ మహిళల అభ్యున్నతికి, వ్యక్తిత్వ వికాసానికి శిక్షణ, చేతి వృత్తుల శిక్షణ, సంఘాల ద్వారా ఆర్థిక క్రమ శిక్షణ వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్థ డైరెక్టర్ మోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ బాలాజీ రెడ్డి, రాష్ట్ర ప్రజా ప్రతినిధులు ఎం హరిబాబు, వేదాచల, సి ముని పార్థసారథి పాల్గొన్నారు.

నేడు 'మనువాదం' కార్యక్రమం: కెవిపిఎస్

ప్రజాశక్తి- పాకాల: తిరుపతి పెదకాపు లేఔట్ లోని సిఐటియు కార్యా లయంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న మనువాదం కార్యక్రమానికి అధిక సంఖ్యలో జనం హాజరై జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కేరళ ఎమ్మెల్యే శాంతకుమారి, రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి , సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, జిల్లా అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం పాల్గొంటారని, ఈ కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

కార్మికులకు అండ: సిఐటియు

ప్రజాశక్తి-ఏర్పేడు: కార్మికులకు ఏ సమస్య వచ్చినా సిఐటియు అండగా వుంటుందని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాలతో ఏర్పేడు మండల మహాసభ శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు కరీముల్లా మాట్లాడుతూ మండలంలో అన్ని కార్మిక సంఘాలు ఒక్కటిగా ఉండటం వల్ల సమస్యల పరిష్కారం సులభతరం అవుతోందన్నారు. ఏర్పేడు మండలంలో కార్మికులకు ఎక్కడ సమస్య వచ్చినా సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కార్యదర్శిగా కె రాంబాబును ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శిగా భాగ్యలక్ష్మి, అధ్యక్షులుగా 'షేక్ కరీముల్లా, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, రామచంద్ర లను ఎన్నుకున్నారు.

శ్రీకాళహస్తి: సిఐటియు శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శ్రీకాళహస్తి తొట్టంబేడు, శ్రీకాళహస్తి మండలాల సిఐటియు సంయుక్త మహాసభలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొల్లం గురునాథం, ప్రధాన కార్యదర్శిగా పెనగలం గురవయ్య, కోశాధికారిగా రేవతితో పాటు మరో 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. శ్రీకాళహస్తి ప్రాంతంలోని కార్మిక, కర్షక సమస్యలపై నూతన కమిటీ అలుపెరగని పోరాటం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య పిలుపు నిచ్చారు.

వంచనకు జగన్ సిద్ధం: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : అమరావతి అంశంలో జగన్ జెటర్న్ తీసుకుని నయవంచనకు సిద్ధమయ్యారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డావెంఉమేష్ రావు శనివారం విమర్శించారు. ఎన్నికలకు ముందు ఒక మాట, అయ్యాక మరో మాట మాట్లాడటం జగన్ నైజమన్నారు. అమరావతి పరిరక్షణ ఉద్యమాన్ని అణిచేవేసి మళ్లీ ఈ జె-టర్న్ తీసుకోవడం వెనుక ఇంకేదో కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు జగన్ మాట నమ్మరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, బీమాల భాస్కర్ ముదిరాజ్, మునిరాజా యాదవ్, వజ్రం కిషోర్ పాల్గొన్నారు.

అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగం "అనువాదం – ఆవశ్యకత" అనే అంశంపై అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించారు. ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత జిల్లెళ్ల బాలాజీ వక్తగా హాజరై మాట్లాడుతూ తెలుగు సాహిత్యం మహాభారత అనువాదంతో ప్రారంభమైందన్నారు. ప్రతి ఒక్కరూ రెండు మూడు భాషలను నేర్చుకోవటం వల్ల అనువాద ప్రక్రియను చేపట్టవచ్చన్నారు. ఇతర భాషలలోని ఉత్తమ గ్రంథాలను మన మాతృభాషలోనికి అనువాదం చేయడం వల్ల ఆ రచనల గొప్పతనాన్ని తెలుసుకోవచ్చన్నారు. అనువాద గ్రంథాలకు కూడా ప్రభుత్వం వారు బహుమతులు ఇవ్వటం వల్ల అనువాద రచయితల సంఖ్య పెరుగిందన్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ అనువాదం వివిధ రంగాల్లో ఉపయోగ పడు తుందన్నారు. పత్రికా రంగం, చలనచిత్ర రంగం, వ్యాపార రంగాలలో అనువాదం ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు. రచయిత జిల్లెళ్ల బాలాజీ తమిళ సాహిత్యం లోని రచనలను తెలుగు లోకి అనువాదం చేసి చాలా పురస్కారాలను అందు కున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరి, శోభ, అన్నమ్మ, ఆంగ్ల విభాగాధిపతి వెంకటలక్ష్మి , లక్ష్మి, మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

ఆటో కార్మికులకు సిపిఎం పిలుపు

ప్రజాశక్తి-నాయుడుపేట: ఈ నెల 15వ తేదీ తిరుపతి లో కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా ఆటో కార్మికుల సమ స్యలపై నిర్వ హించనున్న ధర్నాకు మద్దతుగా ప్రజలందరూ తరలి రావాలని నాయుడుపేట సిపిఎం కార్యదర్శి శివకవి ముకుంద కోరారు. నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ధర్నాకు పెద్ద సంఖ్యలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు మస్తాన్ రెడ్డి సతీష్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక బతుకు దరువుకై ఆటో తోలుతున్నారని ఆటో కార్మికులకు గత వైసిపి ప్రభుత్వం సంవత్సరానికి పదివేలు ఇచ్చేదన్నారు. వారి ఇచ్చే డబ్బులు కాకుండా తాము బాడుగులు తోలుకొని ఫైనాన్స్ ఇంట్లో జీవనం గడిపేవారమన్నారు. సిఐటియు నాయకులు శివకవి ముకుంద, అబ్దుల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చి ఆటో కార్మికులు కడుపులు కొట్టే విధానాలు చేపడుతున్నారని ఆటో కార్మికులకు ప్రభుత్వం బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వకుండా ప్రైవేట్ ఫైనాన్స్‌లోఅధిక వడ్డీతో ఆటోలు కొని ఆర్టిఏ చలానాలు ఈ చలానా రమణా రంగాన్ని మొత్తం ప్రైవేటీకరణ చేయాలని ఆలోచనతో ఇప్పటికే డ్రైవింగ్ లైసెన్సులు ఫిట్నెస్ సర్టిఫికెట్ కు జారీచేసే ఏ, టి, సి, సెంటర్లను ఏర్పాటు చేసి రవాణా కార్యాలయాలను నిర్వర్యం చేశారన్నారు. ఈనెల 15న తిరుపతి కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్ , రమేష్, రఫీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుట్టను తవ్వేయ్.. మట్టిని దోచేయ్..!

ప్రజాశక్తి - యర్రావారిపాలెం

ఎర్రచందనం స్మగ్లింగ్‌కు ఒకప్పుడు రాచబాటగా ఉన్న భాకరాపేట, నేడు ఇసుక, ఎర్రమట్టి అక్రమ రవాణాకు కేంద్రంగా మారింది.. కొంతమంది అధికారుల అండతో గుట్టలను సైతం తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా హిటాచీలతో పెకలించి వేస్తున్నారు. టిప్పర్లతో ఎర్రమట్టి వేల రూపాయలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

మండలంలోని ఉదయమాణిక్యం పంచాయతీ నగరి సమీపంలో గల 40 ఎకరాల విస్తీర్ణంలో గల కోడిపిల్ల గుట్టను హిటాచీలతో ఇష్టాను సారంగా తవ్వేస్తూ టిప్పర్లతో తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు ఎకరం విస్తీర్ణం మేర తవ్వి మట్టిని తరలించేశారు. గుట్టలుగా ఉండడంవల్ల పశువులు, గొర్రెల కాపరులు మేపుకొని జీవనం సాగిస్తున్నారని అటువంటి గుట్టలను తవ్వేస్తున్నారని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవిన్యూ అధికారులు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గుట్టలకు భద్రత కల్పించి హెచ్చరికలు జారీ చేయాలని కోరుతున్నారు. గుట్టలను కరిగించేస్తున్న రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఉదయ మాణిక్యం పంచాయతీలోనే కాకుండా మండల వ్యాప్తం గా ఎక్కడ చూసినా గుట్టలను చదును చేస్తూ ఆక్రమించుకుని రెవెన్యూ అధికారుల అండతో అనుభవంలోకి తెచ్చుకుంటున్నారన్న విమర్శలూ ఉన్నాయి.

గుట్టలు ఆక్రమించేవారిపై చర్యలు తీసుకోవాలి : పాటూరు రెడ్డప్ప, దళిత నాయకుడు

మండల వ్యాప్తంగా గుట్టలు తవ్వి ఆక్రమించుకుంటున్న వారిపై రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. దళితులకు ఒక సెంటు ప్రభుత్వ భూమి ఇంటి స్థలం కోసం ఇవ్వాలంటే పాలకులు ఇవ్వడం లేదు. అదే గుట్టలను ఆక్రమించుకుంటుంటే మాత్రం పట్టించు కోవడం లేదు.

అదాలత్ తీర్పే అంతిమం

సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్

ప్రజాశక్తి - గూడూరు టౌన్, శ్రీకాళహస్తి

చిన్నచిన్న గొడవలతో కేసులు పెట్టుకుని సంవత్సరాలు తరబడి కోర్టులు చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బుని వధా చేసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకొని ఇరువర్గాల వారు ఆనందంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బి. రాజేష్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని కోర్టు ఆవరణంలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బి. రాజేష్ మాట్లాడుతూ... కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించడం జరుగుతుందని, లోక్ అదాలత్ ద్వారా కేసు పరిష్కరించుకుంటే హైకోర్టుకు అప్పీలు ఉండదని తెలిపారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బివి సులోచన రాణి, ఏపీపీ లక్ష్మీనారాయణ, బార్ వైస్ ప్రెసిడెంట్ పి. హరి ప్రసాద్ పాల్గొన్నారు.

సమానం, సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్ ఉపయోగించుకోవాలనీ, అదాలత్ లో వెలువడే తీర్పు సుప్రీంతో సమానమని 12వ అదనపు జిల్లా జడ్జ్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రిమినల్, చెక్ బౌన్స్, ప్రమాద పరిహారం, లేబర్, సివిల్ కేసులను అక్కడికక్కడే పరిష్కరించి రూ. 88 లక్షలను ఆదా చేసినట్లు న్యాయమూర్తి తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జ్ బేబీ రాణి , జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జిలు

పుత్తూరు టౌన్ : జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం పొంద వచ్చాని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. పుత్తూరు కోర్టులో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 214 కేసులు పరిష్కరించినట్లు కోర్టు తెలిపింది. వివిధ కేసులలో ఉన్న 4,979 మంది వ్యక్తుల మధ్య రాజీ కుదర్చి శాంతియుతంగా సమస్యలను పరిష్కరించారని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధికారి రాఘవేంద్ర తెలిపారు. ఆయన కథనం మేరకు182 క్రిమినల్ కేసులను పరిష్కరించి, రూ. 4,53,490 పరిహారంగా చెల్లింపులు జరిపారు. 1862 సివిల్ కేసుల్లో సుమారు రూ. 25,00,000 విలువైన వివాదాలను రాజీ ద్వారా పరిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కోర్టులో ప్రత్యేకంగా మూడు బెంచ్‌లు ఏర్పాటు చేసి, కేసులను విచారణకు తీసుకున్నారు. ఇందులో లక్ష్మీ దేవి, పుత్తూరు జనకి, పుత్తూరు కే. రమ్య సాయి తదితర న్యాయసేవాధికారులు పాల్గొన్నారు. ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై, స్నేహపూర్వకంగా వివాదాలను పరిష్కరించుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించారని అధికారులు పేర్కొన్నారు. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కక్షిదారులకు మధ్యాహ్నం ఉచిత భోజనాన్ని అందించారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మూడు జంటలను న్యాయవాదులు మురుగేషన్ రెడ్డి, రాజారెడ్డి, గాలి సురేష్, లక్ష్మీనారాయణ, రాజేష్ కలిసి కలిపారు.

పరిశ్రమలు, ప్రభుత్వం కలిసి ముందుకెళ్లాలి

పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి యువరాజ్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

పరిశ్రమలు, ప్రభుత్వం రెండూ కలిసి ముందుకు వెళితేనే ప్రపంచ స్థాయిలో ఈజ్ అఫ్ డూయింగ్ బిజినెస్‌లో ముందువరుసలో ఉంటామని పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ యువరాజ్ తెలిపారు. శనివారం తిరుపతి లోని కెన్సస్ హోటల్‌లో సులభతర వాణిజ్య అవగాహన ప్రాంతీయ సదస్సులో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ హాజరవగా, పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి డా.ఎన్ యువరాజ్ వర్చువల్‌గా హాజరై పరిశ్రమ యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ గ్లోబల్ స్థాయిలో భారత్ అనేది విస్తతమైన అవకాశాలున్న దేశం అని, ఆ అవకాశాలను వాడుకోవాలంటే ప్రస్తుత వ్యవస్థలో సరళీకరణ, ఆన్‌లైన్ సౌకర్యాలు, నమ్మకం ఆధారిత విధానం ఉండాలన్నారు. అప్పుడు మాత్రమే దేశం డబుల్ డిజిట్ గ్రోత్ సాధిస్తుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రాధాన్యతలలో పారిశ్రామిక అభివద్ధి అగ్రస్థానంలో ఉందని, పెట్టుబడిదారుల సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. తిరుపతి జిల్లా స్థూల జిల్లా ఉత్పత్తిలో 45శాతం పరిశ్రమల వల్లనే వస్తోందని, ప్రతి వారం రెండు మూడు రోజులు పారిశ్రామిక రంగానికి కేటాయిస్తున్నానని అన్నారు. శ్రీ సిటీ, నాయుడుపేట, కష్ణపట్నం, స్మార్ట్ సిటీ, రౌతుమాల ఇండస్ట్రియల్ పార్క్ వంటి విభిన్న పారిశ్రామిక నమూనాలు ఇప్పటికే విజయవంతం అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐ ఐ సి జెడ్ ఎమ్ విజయ్ భరత్ రెడ్డి, పరిశ్రమల శాఖ డిడి మురళి పాల్గొన్నారు.

వేపగుంట విద్యార్థుల ప్రతిభ

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కార్వేటినగరం డైట్ కళాశాలలో ఈ నెల 11, 12వ తేదీలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ 2025 పోటీలు థియేటర్ ఆర్ట్‌లో వేపగుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్ యేసు కుమార్, పూజిత , అనుష్క, దీక్షిత జిల్లా స్థాయిలో మొదటి బహుమతి పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాటల పోటీల్లో సమీరా, సబిత తృతీయ బహుమతి పొందారు. ఇన్స్ట్రుమెంట్ మ్యూజిక్‌లో జాన్ వెస్లి, హార్థిక్ ప్రోత్సాహక బహుమతి పొందినట్లు కళా ఉత్సవ్ నోడల్ ఆఫీసర్ రంజిత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఈఓ విజయకుమార్, డైట్ సూపరింటెండెంటు కృపాలక్ష్మి , వైస్ ప్రిన్సిపాల్ దామోదరం, వేణుగోపాల్, సుభాషిణి, శైలజ, వేపగుంట ఉపాధ్యాయ బృందం, పుత్తూరు ఎంపీపీ మునివేలు, సర్పంచ్ గిరిజా ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు బాలాజీ, పాఠశాల ఛైర్పర్సన్ బుజ్జిబాబు, విజయకర్ ఫౌండేషన్ డైరెక్టర్స్ కేవిఎల్ నాయుడు, మోటివేటర్ భాగ్యరాజ్, విద్యార్థులకు గైడ్ టీచర్ కరుణాకర్‌కు అభినందనలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఓం శ్రీ వృద్ధాశ్రమంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ మెడనూరు సురేష్ రెడ్డి దంపతులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా రెండవ శనివారం వృద్ధులకు భోజనం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు వాకాటి రామ్మోహనరావు, టీచర్ రాధయ్య, కేఆర్ఎం, వాచ్ షాపు రాము, పయ్యావుల మురళి నాయుడు, నవీన్ జయకుమార్, శ్రీనివాసులు, తూపిలి యశ్వంత్, డిష్ నాగరాజు, గోల్డ్ మల్లికార్జున, కృష్ణారెడ్డి, నాగేంద్ర, నిర్వాహకురాలు కళ్యాణి పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకుందాం

మాలల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు విజయానంద్

ప్రజాశక్తి - క్యాంపస్ :

చిత్తూరు జిల్లా మాల ఉద్యోగుల గెజిటెడ్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం

రాష్ట్రంలోని మాలల ఉద్యోగుల సమస్యలను ఐక్యతతో పరిష్కరించుకోవాలని మాల ఉద్యోగుల గెజిటెడ్ రాష్ట్ర అధ్యక్షులు విజయానంద్ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మాలల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం, ఆంధ్రప్రదేశ్ మాల గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం, ఉమ్మడి చిత్తూరు జిల్లా సంఘ ఆధ్వర్యంలో శనివారం ఎస్వీయూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం గెజిటెడ్ రాష్ట్ర అధ్యక్షులు విజయానంద్, జనరల్ సెక్రెటరీ రామకృష్ణ, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ రత్న ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ అరవింద్, మాల గెజిటెడ్ అడ్వైజర్ శంకరయ్య, పబ్లిక్ సెక్రెటరీ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ మాలలు ఐక్యతతో భావితరాలకు దిశా నిర్దేశకులుగా ఉండాలన్నారు. ఉద్యోగుల సమస్యల కోసం ఎల్లప్పుడూ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా మాల ఉద్యోగుల సంఘం గెజిటెడ్ అధికారుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, సత్యనారాయణ, దుర్గేష్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా 20 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి గురప్ప, రిటైర్డ్ జెడి విజయ్ కుమార్, ప్రొఫెసర్ బాలాజీ, తలారి మహేష్, డాక్టర్ అండ్ కృష్ణమూర్తి, ఎం దుర్గేష్, జీవి సత్యనారాయణ, ఎస్వియు ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విశ్వం విద్యా సంస్థలకు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - క్యాంపస్ : బెంగళూరులో ఘనంగా నిర్వహించిన 'భారతీయ శిక్షణ రత్న అవార్డ్స్ -2025' కార్యక్రమంలో తిరుపతి విశ్వం సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు 'బెస్ట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్ -2025' జాతీయ అవార్డు లభించింది. ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సంతోష్ హెగ్డే, ప్రముఖ విద్యావేత్త రంజనా రాజోరా శర్మ చేతుల మీదుగా విశ్వం విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్ విశ్వచందనరెడ్డి, విశ్వశ్రీ స్వీకరించారు. కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ విద్యా రంగంలో విశ్వం నిరంతరం పాటిస్తున్న ఉన్నత ప్రమాణాలు, క్రమశిక్షణ, విలువలతో కూడిన శిక్షణ, జాతీయ స్థాయిలో విద్యార్థులు సాధిస్తున్న విజయాలు ఈ అవార్డుకు కారణమని పేర్కొన్నారు. విశ్వం సైనిక్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులను ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్, మిలటరీ స్కూల్స్, నవోదయ విద్యాలయాలు వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ప్రవేశం పొందేలా శిక్షణ ఇస్తూ ప్రతి ఏడాది వందలాది విజయాలను నమోదు చేస్తోందన్నారు. ముఖ్యంగా 2025 విద్యా సంవత్సరంలో సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించడం విశేషమని అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కర్ణాటక రాష్ట్ర మంత్రి హెచ్ అంజనేయ, ఆధ్యాత్మిక నాయకులు డాక్టరు మలయ శాంతముని, నటుడు చేతన్ కుమార్ విశ్వం విద్యా సంస్థలకు అభినందనలు తెలిపి ఎన్ విశ్వచందన్ రెడ్డికి జ్ఞాపికను అందించారు.

కలిసికట్టుగా పని చేయండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కలిసి కట్టుగా పని చేసి టౌన్ బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచించారు. టౌన్ బ్యాంకు నూతన కమిటీ శనివారం ఎమ్మెల్యేను కలిసింది. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. టౌన్ బ్యాంకు చైర్మన్ షేక్ ఖాదర్ బాషా, సభ్యులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో 40 శాతం వర్క్ స్కిల్స్ భారత యువతదే..

- ఆలోచన శక్తి పెంపొందించుకోవాలి
- ఇన్‌స్పైరింగ్ మైండ్‌లో ఎన్ఎస్ఏబి సభ్యులు
- సతీష్ రెడ్డి, చైర్మన్ మన్నెం రామిరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): భవిష్యత్తులో 40 శాతం వర్క్ స్కిల్స్ భారత యువతదే అని, విద్యార్థులు ఆలోచన శక్తి పెంపొందించుకోవాలని ఎన్ఎస్ఏబి సభ్యులు సతీష్‌రెడ్డి, శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇన్‌స్పైరింగ్ మైండ్స్'ను శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సతీష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు దేశ పరిశోధనల వివరాలు, వాటి లక్ష్యాలు భారత ఎలా చేరుకుందన్న విషయాలు విశీదీకరించారు. దేశంలో విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరిగాయని, దీంతో ప్రతి ఏడు 15 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు వివిధ కళాశాల నుండి పట్టాలు చేత పట్టుకుని ఉద్యోగాన్వేషణలో 90 శాతం విజయవంతం అవుతున్నారన్నారు. నాడున్న ఇంజనీరింగ్ విద్యకు, నేడున్న ఇంజనీరింగ్ విద్యకు చాలా తేడా ఉందని, నూతన పరిశోధనలు, ఉన్నత విద్య సిస్టంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా ఆవిష్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. దేశంలోని ప్రతి రాష్ట్రంలో, అక్కడక్కడ జిల్లాలలో కేంద్ర విద్యా సంస్థలు విరివిగా నెలకొల్పడం, ఆయా ప్రాంతాల్లోని విద్యార్థులకు పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించడానికి ఇంక్యుబేషన్ సెంటర్లను ప్రారంభిం చిందన్నారు. వీటి ఫలితంగా నూతన ఆవిష్కరణ ఆవి ష్కృతమమవుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచం లోని స్కిల్ వర్కర్ల శాతంలో 40 శాతం మంది భారత యువతే ఉంటారన్నారు. డిఆర్డిఓకు సంబంధించి భారత యువత

తీసుకువచ్చిన నూతన ఆవిష్కరణలను విద్యార్థులకు వివరించారు. శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన శక్తి పెంచుకోవాలన్నారు. సమయం చాలా విలువైందని, ఆ సమయం ఉన్నప్పు డే పరిశోధనలతో కూడిన లక్ష్యాన్ని విద్యార్థు లు ఎంచుకొని లక్ష్యం వైపు అడుగులు వేయా లని సూచించారు. కళాశాల డైరెక్టర్ మన్నెం రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మన చదువు, ఉద్యోగ బాధ్యతలు మన దేశానికి మనం ఏమి చేశాం అనే విధంగా ఉండాలన్నారు. డాక్టర్ జి సతీష్ రెడ్డిని శాలువతో సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వాసు, అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

ఎంవి రావు ఫౌండేషన్‌కు సేవారత్న పురస్కారం

ప్రజాశక్తి-కోట: మండలంలోని ఎంవి రావు ఫౌండేషన్ అందించిన సేవలకు పల్నాడు జిల్లా చిలకలూరి పేటకు చెందిన జయ జయ సాయి ట్రస్ట్ సేవా రత్న పురస్కారం శనివారం అందించింది. కోట మండలం చెందోడులో ఉద్యోగ విరమణ చేసిన అధ్యాపకునిగా శ్రీ విద్యా వికాస్ పాఠశాల యాజమాన్య సభ్యులుగా ఉన్న ముప్పవరపు వెంకటేశ్వరరావు 2008లో మృతి చెందిన అనంతరం వారి కుటుంబ సభ్యులు 2009లో ఎంవి రావు ఫౌండేషన్ నిర్వహించి నెల్లూరు, తిరుపతి జిల్లాల వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు ముప్పవరపు ఆదిలక్ష్మి తమకు వచ్చే ప్రభుత్వ పెన్షన్ ద్వారా నిస్వార్థంగా విద్య, వైద్య రంగాలతో పాటు విద్యార్థులకు చేయూత , ప్రతిభావంతులకు పురస్కారాలు అందించి పలువురు ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నారు. దీన్ని గుర్తించిన పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణానికి చెందిన జై జై సాయి ట్రస్ట్ వారు ప్రజాసేవ రత్న అనే అవార్డున, ప్రశంసా పత్రాన్ని, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ లీలా మోహన్ కృష్ణ, సెక్రెటరీ విజయలక్ష్మిలకు ఈ పురస్కారం అందించి సత్కరించారు. ఫౌండేష న్ నిర్వాహకులు రాజ్యలక్ష్మి, సుధారాణి, పద్మజ, సాంబశివరావులు నిర్వాహ కుల తో కలిసి లీలామోహన్ కృష్ణను, విజయలక్ష్మిని అభినం దించారు. ఈ కార్యక్రమంలో జయ జయ సాయి ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ, శిరిడీ దత్త సాయి అన్నప్రసాదం చైర్మన్ మద్ది రమేష్ బాబు దంపతులు,


పురస్కారం అందుకున్న ఎంవి రావు ఫౌండేషన్ సభ్యులు

చిలకలూరిపేట మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ కరిముల్లా, చిలకలూరిపేట మున్సిపల్ ఛైర్మన్ రహంతుల్లా, డాక్టర్ సుష్మ, హైదరాబాదుకు చెందిన కరోనా సైంటిస్ట్ ఆచార్యతో పాటు సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు గాయపడ్డ సంఘటన తిరుపతి గరుడ వారధిపై శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి సమీపంలోని ఓ ప్రైవేట్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు చక్రధర్, వేదాంత్ కళాశాలకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తిరుపతి గరుడ వారధిపై లక్ష్మీపురం సర్కిల్‌ను సమీపిస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో చక్రధర్ (19) అక్కడి కక్కడే మృతి చెందాడు. వేదాంతకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఈస్ట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద పరిస్థితిని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుండి పడి యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్: రైలు నుండి పడి మృతి చెందిన సంఘటన వేపగుంట స్టేషన్ వద్ద శనివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు కథనం మేరకు..శనివారం ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో అందిన రైల్వే సమాచారం మేరకు 25 నుండి 30 ఏళ్ల మధ్య వయసు వున్న గుర్తు తెలియని యువకుడు కిలోమీటర్ నెంబర్ 104/23-21 పోస్టుల వద్ద వున్న ఎగువ రైలు మార్గంలో వేపగుంట ఆర్ ఎస్ ప్లాట్‌ఫాం నెంబర్ 3 వద్ద కదులుతున్న రైలు నుండి పడిపోయినట్లు రైల్వే బండి నెంబర్ 22504 టి ఎం ఆర్ ఇచ్చిన సమాచారం మేరకు తెలిసిందని రైల్వే పోలీసులు తెలిపారు. రైలు నుండి పడిన కారణంగా తల వెనుక భాగం, నుదుటిపై, కాలు, మెడ వద్ద, గడ్డం వద్ద శరీరమంతా గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. దీనిపై రైల్వే ఎస్ఐ ఎం ధర్మేంద్ర రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి నలుపు రంగు ప్యాంటుపై సన్నని గీతలు గల డిజైన్, తెలుపు రంగు షర్టుపై సన్నని పూల డిజైన్ కాకి రంగు ఫుల్ డ్రాయర్‌పై ఓ ఎక్స్ ఓ అనే ఆంగ్ల అక్షరాలు వున్నాయని, తెలుపు రంగు కట్ బనియన్ తొడిగి వున్నాడని ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి ఏర్పాటు

ప్రజాశక్తి- చంద్రగిరి: చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ వెంకటముని, ఎం గోపీనాథ్, మునిరత్నమ్మ, కె దుర్గా, పి పాపమ్మ, జి దేవి, ఎం గోపాల్ రెడ్డి, యూ భారతి, ఎం యోగానందం, బీవీ స్వప్న, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా పద్మావతిలను నియమించారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందాయి.

15 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, యోగ, చెస్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో అండర్ -14, అండర్ - 17 బాల బాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ- 1 తిరుమల రాజు, ఎంఈఓ- 2 బాలసుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు పుత్తూరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు మండల స్థాయి ఎస్‌జిఎఫ్ టోర్నమెంట్, ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు మండల కో ఆర్డినేటర్, పీడీ గోపికృష్ణ తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎంఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో బైక్ జాతా పోస్టర్లును విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బైక్ జాతాను ద్విహించనున్నామన్నారు. ఈనెల 25వ తేదీన విజయవాడలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని రణభేరి పేరుతో యూటీఎఫ్ ధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలతోపాటు విద్యారంగ సమస్యలు సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సుధీర్, రవి, మురళీసింగ్, ప్రసాద్, మాధవరావు, శివాజీ, మురళీమోహన్, గురునాదం, , వరప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్పీకర్ కు ఘన స్వాగతం

ప్రజాశక్తి- రేణిగుంట: రాష్ట్ర అసెంబ్లీ [illegible] అయ్యన్నపాత్రుడుకి రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. శనివారం జాతీయ మహిళా సాధికారత సదస్సులో పాల్గొనడానికి విమానాశ్రయానికి విచ్చేసిన రాష్ట్ర స్పీకర్‌ను టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, టిటిడి బోర్డు సభ్యులు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి శాలువా తో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర స్పీకర్ ప్రత్యేక వాహనం లో తిరుపతికి బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో ఆయనకు శాప్ చైర్మన్ రవి నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, తెలుగు యువత నాయకులు శ్రీధర్ వర్మ , టిడిపి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

In the Court of the Prl. Senior Civil Judge, Tirupati
O.E.P.No. 45/2025
O.S.No. 139/1997

A.Vinod Kumar ...D.Hr
Vs.
K.Muni Reddy & Others ..J.Drs

Rule 22 Notice to the J.Dr No.1 to 3

1) K.Muni Reddy S/o Chenga Reddy
2) K.Chandrasekhar S/o Muni Reddy
3) K.Rathnamma W/o Munireddy
1 to 3 Residing at D.No.8-15, Santhi Nagar, Muthyalareddipalli Panchayat, Tirupati

పై కనిన J.Dr. No. 1 to 3 లకు Rule 22 Notice లు నిమిత్తం తేది. 15.10.2025న ఉదయం 10.30 గం॥లకు పై కనిన J.Dr. No. 1 to 3 లు పై కనిన కోర్టులో హాజరై సమాధానం చెప్పుకోవలసినదిగా కోర్టువారు వాయిదా వేసియున్నారు. రానియెడల పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది. 15.10.2025

K.PARTHASARATHY
N.SRINIVASA RAO
Advocates, Tirupati

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVION) SRIKALAHASTI
I.A.No. 803/2023
O.S.No.138/2023

ఎ.రమణయ్య ...వాది
Vs
యన్. నాగభూషణం & యితరులు ...ప్రతివాదులు

6 & 7 ప్రతివాదులకు I.A. నోటీసు మరియు సమన్లు

6వ ప్రతివాది: యన్.చిరంజీవి తండ్రి లేట్ యన్. వెంకటసుబ్బయ్య,
7వ ప్రతివాది: కె.ఆదెయ్య తండ్రి శిదయ్య ఆదవరం గ్రామం, రాగిగుంట గ్రామం & పోస్ట్, కె.వి.బి.పురం మండలం, తిరుపతి జిల్లా

పై దావాలోను మరియు Injection Petition లలో కోర్టువారు 6,7 ప్రతివాదుల హాజరు నిమిత్తమై వాయిదాను 25.09.2025వ తేదీకి వేసియున్నారు. కావున మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు యందు ఉదయం 10:00 గం॥లకు హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల కోర్టువారు పైకేసును పరోక్షముగా తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

ఇట్లు
N. PADMANABHAM, B.A, B.L.,
Advocate, Tirupati
Ph.No. 9030787739

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఉపాధ్యాయులది సమాజ నిర్మాణంలో కీలకమైన పాత్ర అని తిరుమల తిరుపతి దేవస్థానం పూర్వ విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం భాస్కర్ రెడ్డి అన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారాలు పొందిన డిగ్రీ అధ్యాపకులకు శనివారం తిరుపతిలో వేమన విజ్ఞాన కేంద్రంలో గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైన వారికి నిర్వహించిన సన్మాన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడు విద్యార్థులకు మార్గదర్శకుడు మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును కూడా నిర్మిస్తారన్నారు. జ్ఞానదాతలైన గురువులను సన్మానించడం మన దేశ సంప్రదాయమని ఇతర వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ పి. కుమారి నీరజ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ ఎం భాస్కర్ రాజు, చిత్తూరు పివికేఎన్ ప్రభుత్వ కళాశాల ఉర్దూ అధ్యాపకులు డాక్టర్ ఈ మహమ్మద్, అన్వర్ హుస్సేన్ లను జ్ఞాపిక, శాలువా, పుష్పమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు ప్రతిస్పందిస్తూ ఈ పురస్కారాల వల్ల తమ బాధ్యత పెరిగిందని, కళాశాలలో విద్యార్థుల అభివృద్ధికి నిరంతరం పాటు పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిసిజిటిఏ తిరుపతి జిల్లా అధ్యక్షులు టి నరసింహులు, కార్యదర్శి ఎస్ శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి డాక్టర్ పి సుజన, చీరాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళి, ఉద్యోగ విరమణ చెందిన ప్రిన్సిపాళ్లు డాక్టర్ జి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సి సుకుమార్ రెడ్డి, డాక్టర్ ఆర్ రాజేంద్రనాయుడు, వే ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ పైడి అంకయ్య, డాక్టర్ ధనంజయరెడ్డి, వి వీరయ్య అధ్యాపకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

భూమి పూజలో పాల్గొన్న నాయకులు

ఇండోర్ బాక్సింగ్ హాలు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ తిరుపతి వారు శాప్ ఛైర్మన్ రవినాయుడు చొరవతో పీ4 విధానం ద్వారా తిరుపతిలోని శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఇండోర్ బాక్సింగ్ హాల్ నిర్మాణానికి ముందుకొచ్చారు. ఈ సందర్భంగా రూ.15లక్షలతో నిర్మించ తలపెట్టిన ఇండోర్ బాక్సింగ్ హాల్ నిర్మాణానికి యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నర్సింహ యాదవ్ , జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) కమిషన్ ఛైర్మన్ డా.ఎన్.బి.హర్షవర్ధన్ రెడ్డి , జేసీఐ జోన్ ప్రెసిడెంట్ టి.భరత్ కుమార్ , జేసీఐ తిరుపతి ప్రెసిడెంట్ శేషసాయి తో కలిసి శాప్ ఛైర్మన్ రవినాయుడు శనివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఐ అడ్మినిస్ట్రేటివ్ కమిటీ మెంబర్ జిఎల్.మనోహర్ , జేసీఐ తిరుపతి ఫౌండేషన్ ఛైర్మన్ ఎమ్.భాస్కర్ నాయుడు , జేసీఐ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రమోద్ కుమార్ , రత్నశేఖర్ , వి.దిలీప్ కుమార్ , శంకర్ , సోమయ్య , డీఎస్డీఓ శశిధర్ పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం అందిస్తున్న దాత

టీటీడీ ఎస్‌వి అన్నప్రసాదం ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి- తిరుమల: నవంబర్ 9న తన పుట్టినరోజు సందర్భంగా ఒక్కరోజు అన్నప్రసాదం వితరణకు అయ్యే ఖర్చు రూ 44 లక్షలు దాత తమిళనాడు రాష్ట్ర మంత్రి కెఎన్ నెహ్రూ తరపున శనివారం విరాళంగా అందించారు. క్యాంప్ కార్యాలయంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుని దాత తరపు ప్రతినిధి సురేష్ కలిసి విరాళం డిడిని అందించారు.

ఏపీ టూరిజం డెవలప్‌మెంటు కార్పొరేషన్ డైరెక్టర్‌గా మునిరత్నం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సిఫారసుతో రాష్ట్ర ప్రభుత్వం వడమాలపేట మండలం బోయలగడ్డ (పత్తి పుత్తూరు)కు చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఎస్ ముని రత్నంను ఏపీ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియ మించింది. తన సేవలు, రాజకీయ నిబద్ధతకు గుర్తింపుగా ఈ పదవి ఇవ్వడంపై ఎస్ మునిరత్నం కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నియామకంపై స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రేపటి నుండి పశువులకు టీకాలు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలోని అన్ని పశువులకు సెప్టెంబరు 15వ తేదీ నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు నెల రోజులపాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు, పశు వైద్యాధికారిణి చందన ప్రియ శనివారం తెలిపారు. మండలం లోని 12067 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని రైతులు అపోహలు మాని పశువులకు టీకాలు వేయించాలని పాల దిగుబడి తగ్గుతుందని చాలామంది అపోహ పడుతున్నారని అపోహలను విడనాడాలని మూడు నెలలు పైబడిన ప్రతి పశువుకు టీకా వేయించాలని, గాలికుంటు వ్యాధి సోకితే పశువులు మృతి చెందడమే కాకుండా రైతులకు కూడా ఆర్థికంగా నష్టం కలుగుతుందని ప్రతి ఒక్క రైతు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని కోరారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి- రేణిగుంట:

రేణిగుంట మండలంలోని గుత్తివారిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల నందు హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాలలో హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థిని విద్యార్థులు వేషధారణలు, నాటకాలు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హిందీ ఉపాధ్యాయురాలు ఆర్ గాయత్రి మాట్లాడుతూ హిందీ భాష ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయ్ భాస్కర్ రెడ్డి , ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న అధికారులు

పెరటి కోళ్ల పంపిణీ

ప్రజాశక్తి -సోమల:

సోమల మండలంలోని మండల సమాఖ్య మహిళా సంఘాలకు నాలుగు క్లస్టర్ల పరిధిలో ఒక్కో క్లస్టర్ కు 25 యూనిట్ల చొప్పున 100 యూనిట్ల పెరటి కోళ్ల పంపిణీని శనివారం చేపట్టారు. ఒక యూనిట్‌కు 3100 రూపాయల విలువచేసే 11 నాటు కోళ్లు పంపిణీ చేశారు. మహిళలు తమ ఇంటి వద్ద నాటు కోళ్లు పెంచుకోవడం వల్ల అవి పెట్టే గుడ్లు పిల్లలను అమ్ముకుని ఆర్థికంగా లాభడవచ్చునని ఏపీఎం శివ అన్నారు. కార్యక్రమంలో సీసీలు పాండు, మునిరత్నం, వహీద్, గంగోజి, సంఘమిత్రలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -రేణిగుంట : సమాజ సేవలో రాజన్న ఫౌండేషన్ సేవలు అనిర్వచనీయమని అమర రాజ లాజిస్టిక్ జనరల్ మేనేజర్ చంద్రబాబు అన్నారు. శనివారం కరకంబాడి సమీపంలోని అమరరాజ కంపెనీలో లారీ డ్రైవర్లకు అమరరాజ లాజిస్టిక్స్, ఎస్వీ అరవింద్ ఐ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాజన్న ఫౌండేషన్ అనేక సేవాకార్యక్రమాలను చేపడుతోందన్నారు. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి పర్యావరణంపై దృష్టి సారిస్తూ రాజన్న ఫౌండేషన్ శివ కార్యక్రమాలతో ముందుకు వెళుతుందన్నారు. అందులో భాగంగా అమర రాజ లాజిస్టిక్స్, ఎస్వీ అరవింద్ ఐ హాస్పిటల్ వైద్య బృందం సహకారంతో లారీ డ్రైవర్ల కోసం ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. అమర రాజ ప్రెసిడెంట్ గ్రూప్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ మాధవ్ మాట్లాడుతూ లారీ డ్రైవర్లు నిరంతరం శ్రమిస్తూ దేశానికి సేవలందిస్తున్నారనీ తెలిపారు. దీర్ఘకాలంగా వాహనాలను నడిపే వారికి మంచి కంటి చూపు ఎంతో అవసరమన్నారు. డ్రైవర్ల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రాజన్న ఫౌండేషన్ ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రితో కలిసి ఈ ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామన్నారు. డ్రైవర్ల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ తోడుగా ఉంటామన్నారు. ఈ శిబిరానికి దాదాపు 200 మంది లారీ డ్రైవర్లు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రి వైద్య బృందానికి, రాజన్న ఫౌండేషన్‌కు అమర రాజ లాజిస్టిక్స్ డ్రైవర్ల తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్ళపల్లి సతీష్, అమర రాజ సిబ్బంది ఎస్వీ అరవింద్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ దళితవాడ గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. వారం రోజుల క్రితం గ్రామంలో పలువురికి జ్వరాలు సోకడంతో అప్రమత్తమైన వైద్యశాఖ ఇంటింటి సర్వే చేసి వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామస్తులకు మందులు, మాత్రలు పంపిణీ చేశారు. పంచాయతీ వారు పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టి మురుగునీటి కాలువలను శుభ్రం చేయించి చెత్తాచెదారాన్ని తొలగించారు. శనివారం వీధులలో దోమల నివారణ మందును స్ప్రే చేయించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య, పంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.